క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా



వీరఘట్టంలో 257వ పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న బీఎల్ఓలు

వీరఘట్టం: అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచుతున్నట్లు తహసీల్దార్ కె.జయప్రకాష్ తెలిపారు. గురువారం విడుదలైన ఎన్నికల నోటిఫికేషన్‌ను పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించారు. వీరఘట్టంలోని 257వ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్ఓలు ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శించారు.

బోర్లకు మరమ్మతులు



పిప్పలబద్రలో బోరు మరమ్మతులు

జియ్యమ్మవలస: వేసవి దృష్ట్యా మండలంలో బోర్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు ఎంపీటీఓ శ్రీనివాసరావు తెలిపారు. పిప్పలబద్ర గ్రామంలో గురువారం పలు బోర్లకు మరమ్మతులు చేశారు. గ్రామాల్లో ఎటువంటి తాగునీటి సమస్య ఉన్నా తెలియజేయాలని ఆయన కోరారు.

వైటీసీ సమీపంలో చెక్‌పోస్టు



చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ, సీఐలు

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం రాత్రి స్థానిక వైటీసీ సమీపంలో రహదారి పక్కన చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళీలు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అప్రమత్తంగా ఉండాలని, వాహనాలపై నిఘా పెంచాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు.

వాహనదారులు సహకరించాలి



బొడ్లపాడు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌సీసీ టీవ్

వీరఘట్టం: ఎన్నికల నియమావళి ప్రకారం అక్రమ మద్యం, డబ్బులు రవాణా జరగకుండా అడ్డుకునేందుకే అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఎస్‌సీసీ ఎం.వి.బి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం ఆయన రేగులపాడు, తూడి, బొడ్లపాడు, వండవ జంక్షన్ల వద్ద వాహన తనిఖీలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

సీతానగరం: సీతానగరం వద్ద సువర్ణముఖీ నదీతీరాన వెలసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిది వారాల పాటు స్వామికి ముడుపులు చెల్లించి పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ

పార్వతీపురంటౌన్: అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి పి.పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్యాస్ గోదాంల వద్ద ప్రమాదాల నివారణపై గురువారం సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అప్రమత్తంగా ఉంటే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చన్నారు.

సాలూరు: అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్, విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రమాదాలు జరిగినపుడు వాటిని ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం, సురేష్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మరో ప్రభంజనానికి శ్రీకారం

- నేడు కళావతి నామినేషన్
- ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే
- ఏకతాటిపై పార్టీ శ్రేణులు
- తరలిరావాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చిన కళావతి



వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మరో ప్రభంజనానికి శ్రీకారం చుట్టబోతున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ నేతత్వంలో పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడిపిస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న కళావతి నేడు సీతంపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు గురువారం నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను ప్రతీ ఇంటికి చేరవేసి ప్రతీ ఇంటికీ నేనున్నానని భరోసా కల్పిస్తూ అందరి మన్ననలు పొందారు. గత ఐదేళ్లగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 450 మంది అభాగ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సుమారు రూ.20 కోట్లు మంజూరు చేయించి వారికి ఆర్థిక భరోసా కల్పించారు. ఇలా అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారికి ఆ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని రెండేళ్ల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించి తెలుసుకున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న కళావతి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీతంపేటలో నామినేషన్ వేయనున్నారు. ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

నేడు కళావతి నామినేషన్

- ఎమ్మెల్సీ విక్రాంత్



క్యాడర్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల సమరంలో పాలకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా విశ్వాసరాయి కళావతి శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నామినేషన్ సమర్పించనున్నారని, పార్టీ శ్రేణులు కదలిరావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఐటీడీఏ పీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8.30 గంటలకే పార్టీ శ్రేణులు పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం వద్దకు చేరుకోవాలని కోరారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం సీతంపేట తరలివెళ్లనున్నట్లు తెలిపారు. అక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరపనున్నట్లు పేర్కొన్నారు. అక్కడ నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కళావతి విజయమే మనందరి లక్ష్యం కావాలని అన్నారు.

ఎన్నికల నియమాలను పాటించాలి



ఉద్దవోలులో కవాతు నిర్వహిస్తున్న ఎస్ఐ, పోలీసులు

గరుగుబిల్లి: ప్రతీ ఒక్కరు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. మండలంలోని ఉద్దవోలు, దళాయి వలస గ్రామాల్లో కవాతు గురువారం నిర్వహించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భానుడి భగభగ



పాలకొండ రూరల్: నిర్మానుష్యంగా పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం కూడలి

పాలకొండ రూరల్: భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. భగభగమంటున్నాడు. ఎండలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే మే నెలలో ఎలా ఉండాలని ఆందోళనకు గురవుతున్నారు. గురువారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. పగటిపూట వేడిమికి తోడు వడగాలులు వీస్తుండటంతో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వృద్ధులు, పిల్లలు తమ శరీరంలో నీటి నిల్వలు తగ్గిపోకుండా సరిపడా నీరు, మజ్జిగ, గ్లూకోజ్, కొబ్బరి నీరు వంటివి తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు వీలైనంతవరకూ నీడ పట్టున ఉండాలని సూచిస్తున్నారు.

సూర్య ప్రతాపం..

గుమ్మలక్ష్మీపురం: ఎండలు, వడగాల్పుల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. భానుడు తన కిరణాలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఈ మేరకు గురువారం ఉదయం 8 గంటల నుంచే సూర్యప్రతాపం కనబడింది. మధ్యాహ్నం 1 గంట సమయంలో గుమ్మలక్ష్మీపురం మండలంలో 42 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. దీంతో మండల ప్రజలు ఎండ వేడిమికి అల్లాడిపోయారు. తప్పని పరిస్థితుల్లో గొడుగులు, కళ్లజోళ్లు, టోపీలను అడ్డుపెట్టుకొని ఆయా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

తాగునీటి కష్టాలకు చెక్



కుంతేష్ పంచాయతీ జిందా గ్రామంలో చెలమల వద్ద తాగునీరు పడుతున్న గిరిజనులు(నాడు)



కుంతేష్ పంచాయతీ జిందాలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు(నేడు)

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరి శిఖర గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఈ కష్టాలకు చెక్ పెట్టింది. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ నీటి కుళాయి ఏర్పాటు చేయడంతో పాటు గిరిశిఖర గ్రామాల్లో వాటర్ ట్యాంకులను నిర్మించింది. దీంతో తాగునీటి కష్టాలు తీరాయని గిరిజనులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

–కొమరాడ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ రూరల్: పట్టణంలోని ఎంఎంనగర్, శ్రీనివాసనగర్, ఎన్‌కె.రాజపురం, శ్రీనినాయుడు నగర్, కోమటిపేట, దేవరిపేట, వెంకంపేట, పెదకాపువీధి, చినకాపువీధి, శ్రీకాకుళం, సీతంపేట రహదారులతో పాటు మండలంలోని ఓని, విజయరామపురం, పరశురాంపురం, సిరికొండ, గదబవలస ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. పట్టణంలోని 11కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలి



సూచనలిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్

సీతంపేట: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ప్రచార ఖర్చులను అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ అన్నారు. గురువారం నియోజకవర్గంలో పర్యటించారు. రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సమక్షంలో వ్యయ పరిశీలన బృందాలతో సీతంపేట ఐటీడీఏ ఆర్వో చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఖర్చులను ఎలా నమోదు చేస్తున్నారని అడిగారు. ధరల పట్టికను పరిశీలించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీరామమూర్తి, లైజన్ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు, పెత్తందారులకు మధ్య పోరాటం

సాలూరు రూరల్: మే 13న జరగనున్న ఎన్నికలు పెత్తందార్లకు పేదలకు మధ్య పోరాటమని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పరిధి పునికినివలస, చిన్నవలస, ముగడవలస గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అలాగే ఓటు ఎలా వేయాలో నమూనా ఈవీఎం ద్వారా అవగామన కల్పించారు. కార్యక్రమంలో కూర్మరాజుపేట మాజీ సర్పంచ్ మన్మథ, తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా జయరాజు నామినేషన్

కురుపాం : కురుపాం అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిమ్మక జయరాజు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను కురుపాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణకు అందజేశారు. అనంతరం నిమ్మక జయరాజు మాట్లాడుతూ బీజేపీ పార్టీ తనను సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పలేదని, ప్రజా సేవ చేయడానికే ఎన్నికల బరిలో దిగుతున్నానని తెలిపారు.

పరీక్షిత్‌రాజు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముగిది పోలినాయుడు ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆయన కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. అలాగే మండలంలోని రావుపల్లి గ్రామ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు కుటుంబ సభ్యురాలు ఒకరు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా పరీక్షిత్‌రాజు పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, గరుగుబిల్లి సర్పంచ్ కె.ఇందుమతి, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.దామోదర్, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, ఆర్.రామినాయుడు ఉన్నారు.

ఈ ఫార్మ్ మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ సురేందర్

గరుగుబిల్లి: రైతులు ఉత్పత్తి చేసిన వ్యవసాయ ఉత్పత్తులను ఈ ఫార్మ్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నందితా మిశ్రా అన్నారు. మండలంలోని తోటపల్లిలో జట్టు ట్రస్ట్ ఏర్పాటు చేసిన అన్నపూర్ణేశ్వరి గిరి శక్తి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బోర్డు డైరెక్టర్‌లకు, గ్రామ స్థాయి కార్యకర్తలకు ఈ ఫార్మ్ మొబైల్ యాప్ వినియోగం, దాని ఉపయోగంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందితా మిశ్రా మాట్లాడుతూ ఏ ప్రాంతంలో ఏ ఉత్పత్తులు తయారవుతున్నాయి? ఏ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి? తదితర అంశాలను తెలుసుకొని మార్కెటింగ్ చేసేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, సీనియర్ మేనేజర్ నరేందర్, కోఆర్డినేటర్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ



హెచ్‌ఎంకు ఆటోమెటిక్ స్కూల్ బెల్ పరికరాలు అందిస్తున్న జయమణి

పాలకొండ రూరల్: స్థానిక హడ్కో కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని కంబాల జయమణి రూ.20వేల విలువ గల పోర్టబుల్ సౌండ్ సిస్టం, మరికొంత ఖర్చుతో ఆటోమెటిక్ స్కూల్ బెల్ గురువారం వితరణగా అందించారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.4వేలు వరుస నాలుగు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు ఏటా అందించనున్నట్లు తెలిపారు. జయమణి వృత్తిపరంగా పాఠశాలకు అందించిన సేవలను హెచ్‌ఎం ఎం.రామలక్ష్మి కొనియాడారు.

తొలి రోజు నామినేషన్లు నిల్



ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న పాలకొండ నియోజకవర్గ ఆర్ఓ కల్పనాకుమారి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో మొదటి రోజు గురువారం నామినేషన్ బోణీ పడలేదు. స్థానిక ఐటీడీఏలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సాధారణ ఎన్నికలు 2024 నోటిఫికేషన్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నోటిఫికేషన్ వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయ నోటీసు బోర్డులో పెట్టారు. అంబేడ్కర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో నామినేషన్‌లు స్వీకరిస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు సెలవు రోజుల్లో తప్ప మిగతా అన్ని రోజుల్లో నామినేషన్‌లు స్వీకరించనున్నామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్‌లు వేసుకోవాలన్నారు.

ఐటీడీఏ వద్ద భారీ బందోబస్తు



సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఐటీడీఏలో పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతుండడంతో గురువారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ వేయడానికి అభ్యర్థితో వచ్చిన ర్యాలీని, వాహనాలను వంద మీటర్ల దూరంలోనే నిలిపి వేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళిలకు సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో సర్వేయర్ బృందంతో రిటర్నింగ్ ఆఫీస్‌కు వంద మీటర్ల దూరాన్ని కొలిచి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎటువంటి వాహనాలను లోపలకు అనుమతించవద్దని డీఎస్పీ పోలీసు సిబ్బందికి సూచించారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. సీతంపేట, దోనుబాయి ఎస్ఐలు జగదీష్‌నాయుడు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



గరుగుబిల్లి: రాజీనామా పత్రాలను చూపిస్తున్న పెద్దూరు వలంటీర్లు



పాలకొండ: రాజీనామాలు చేసిన వలంటీర్లు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని పలు సచివాలయాల పరిధిలోని వార్డు వలంటీర్లు గురువారం రాజీనామాలు చేశారు. 8వ వార్డు పరిధిలో 10 మంది, 10వ వార్డులో 6గురు వలంటీర్లు రాజీనామాలను కమిషనర్ సర్వేశ్వరరావుకు అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకే రాజీనామాలు చేస్తున్నామని ప్రకటించారు.

స్వచ్ఛంద రాజీనామా

పాలకొండ రూరల్: మండలంలోని చిన మంగళాపురం గ్రామానికి చెందిన వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా తమ విధులకు రాజీనామా చేశారు. మండల కేంద్రానికి చేరుకున్న 10 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణకు అందించారు.

14 మంది వలంటీర్లు రాజీనామా

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు సచివాలయం పరిధిలో పని చేస్తున్న 14 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. టీడీపీ కూటమి,పచ్చ మీడియా చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టేందుకే ఈ రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిశలో..

సీతంపేట: కోడిశ పంచాయతీ పరిధిలో 14 మంది వలంటీర్లు గురువారం రాజీనామ చేశారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శికి రాజీనామ పత్రాలు అందజేశారు. ఇకపై సీఎం జగనన్నకు మద్దతుగా తాము పని చేస్తామని ప్రకటించారు.

వలంటీర్లు రాజీనామా

జియ్యమ్మవలస: మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 89 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అల్లువాడ, కుదమ, అలమండ, కన్నపుదొరవలస, పెదబుడ్డిడి సచివాలయాల నుండి రాజీనామాలు అందజేసినట్లు తెలిపారు.

కొమరాడ: మండలంలోని కంబవలస సచివాలయం పరిధిలో 22 మంది వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు తమ రాజీనామా పత్రాలను గురువారం అందజేశారు. సచివాలయ కార్యదర్శి నాగరాజుకు సంబంధిత పత్రాలను అందజేశారు.

భామినిలో...

భామిని: మండలంలోని కాట్రగడ – బీ, నల్లరాయి గూడలకు చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. సచివాలయ కార్యదర్శి కె.సంతోష్‌కు రాజీనామా పత్రాలు అందజేశారు.



పాలకొండ రూరల్: ఎంపీడీవోకు రాజీనామా పత్రాలను అందిస్తున్న చిన మంగళాపురం వలంటీర్లు



వీరఘట్టం: రేగులపాడులో రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు



సీతంపేట: రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు



జియ్యమ్మవలస: ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేసిన కన్నపుదొరవలస సచివాలయం వలంటీర్లు

గరుగుబిల్లిలో...

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, ఉద్దవోలు, గొట్టివలస, చినగుడబ, కొత్తపల్లి గ్రామాలకు సంబంధించి 41 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను గురువారం ఎంపీడీఓ పి.సూర్యనారాయణకు అందజేశారు. పెద్దూరు కు సంబంధించి 11మంది, ఉద్దవోలుకు సంబంధించి ఆరుగురు, గొట్టివలసకు 16మంది, చినగుడబకు ముగ్గురు, కొత్తపల్లి గ్రామానికి సంబంధించి ఐదుగురు రాజీనామా పత్రాలను అందజేసినట్లు తెలిపారు.